క్లుప్తంగా

నేడు సర్వసభ్య సమావేశం

అంబాజీపేట: స్థానిక మండల ప్రజా పరిషత్ సర్వ సభ్య సమావేశం సోమవారం మధ్యాహ్నం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జి.సరోవర్ తెలిపారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగే సమావేశానికి అధికారులంతా హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు.

నేటి నుంచి ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు శిక్షణ

అంబాజీపేట: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం, మంగళవారం రెండు రోజుల పాటు గ్రామ ఉప సర్పంచ్‌లకు, వార్డు సభ్యులకు శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జి.సరోవర్ తెలిపారు. జిల్లా పరిషత్ సీఈఓ ఆదేశాల మేరకు ఈ శిక్షణ తరగతులు జరుగుతాయని వీటిని వార్డు సభ్యులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వెంకన్న ఆలయంలో ప్రముఖుల పూజలు



స్వామి వారి సన్నిధిలో ప్రముఖులు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ప్రముఖులు స్వామికి పూజలు నిర్వహించారు. రాజ్‌భవన్ జాయింట్ సెక్రటరీ సూర్యప్రకాష్ కుటుంబ సభ్యులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.అలాగే పలువురు ప్రముఖులు స్వామి వార్ని దర్శించుకున్నారు.

పంచాయతీ కార్యదర్శుల బదిలీలు

అంబాజీపేట: మండలంలోని మాచవరం, కె.పెదపూడి, పుల్లేటికుర్రు, తొండవరం గ్రామ పంచాయతీల కార్యదర్శులు బదిలీ కాగా వారి స్థానంలో నూతన కార్యదర్శులు ఉద్యోగ బాధ్యతలను స్వీకరించినట్లు ఎంపీడీఓ జి.సరోవర్ ఆదివారం తెలిపారు. అల్లవరం నుంచి మాచవరం పంచాయతీకి కేవీవీ సత్యనారాయణ, కె.పెదపూడి పంచాయతీకి పి.గన్నవరం నుంచి బి.అప్పారావు, తొండవరం పంచాయతీకి కొత్తపేట నుంచి డి.వరలక్ష్మిలు ఉద్యోగ బాధ్యతలను స్వీకరించారన్నారు. అలాగే ఎంపీడీఓ కార్యాలయ ఏఓగా ఏపీఎల్ నరసింహం, సీనియర్ అసిస్టెంట్‌గా వీవీ గిరిబాబు, టైపిస్టుగా కేవీఎస్ బాలాదీప్‌లు బాధ్యతలను స్వీకరించారన్నారు.

శస్త్రచికిత్సకు ఆర్థిక సాయం



రవికుమార్ కుటుంబ సభ్యులకు సాయం అందిస్తున్న పాపారావు

ఆలమూరు: మండలంలోని పెదపళ్లలో మెదడు సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఏడిద రవి కుమార్‌కు ఆర్థిక సాయం పంపిణీ జరిగింది. ఆలమూరుకు చెందిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రైసుమిల్లర్స్ సంఘం అధ్యక్షుడు వంటిపల్లి పాపారావు ఆదివారం రవికుమార్ నివాసానికి వెళ్లి తమ వంతు సాయంగా రూ.15 వేలను అందజేశారు. అలాగే పలువురు దాతలు వ్యాధితో బాధపడుతున్న రవికుమార్‌ను ఆదుకునేందుకు తమ వంతు సాయం అందిస్తున్నట్లు రవికుమార్ కుటుంబసభ్యులు తెలిపారు.

నిత్యాన్నదానానికి విరాళం

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం ఖండవల్లికి చెందిన మొల్లేటి పుణ్యమూర్తి కుటుంబ సభ్యులు ఆదివారం రూ.10,116 విరాళం అందజేశారు. దాత ఈ సొమ్మును ఆలయ అర్చకులకు అందజేశారు. అర్చకులు ఆశీర్వచనం అందజేసి, స్వామి శేషవస్త్రాలు చిత్రపటం, ప్రసాదం అందజేశారు. దాతను పలువురు అభినందించారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

పి.గన్నవరం: ముంగండలోని మంత్రవాది ఇందిరా కుమారి స్మారక గ్రామీణ వైద్యాలయంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు హోమియో వైద్యుడు ఖండవిల్లి నాగేశ్వరరావు తెలిపారు. వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి ఆస్పత్రి వైద్య సిబ్బంది కంటి పరీక్షలు చేస్తారన్నారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేస్తారన్నారు.

మద్యం షాపుల దరఖాస్తులకు ఈనెల 9 వరకే గడువు

కొత్తపేట: నూతన మద్యం పాలసీ విధానంలో దరఖాస్తులను ఈనెల 9వ తారీఖు సాయంత్రం 5 గంటల్లోపు అందజేయాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కె.కాత్యాయని తెలిపారు. ఆదివారం సాయంత్రం సీఐ ఒక ప్రకటన విడుదల చేశారు. మద్యం షాపునకు దరఖాస్తు చేసుకునే వ్యక్తి డీడీ అండ్ ఈవో కోనసీమ డిస్ట్రిక్ట్ పేరు మీద డీడీ తీయాలని పేర్కొన్నారు. అలాగే ఒకటి కన్నా ఎక్కువ అప్లికేషన్లు ఇచ్చే వ్యక్తి తమ ప్రతినిధి డిక్లరేషన్ ఫామ్ అందజేయాలని సూచించారు. ఈ నెల 11వ తేదీ ఉదయం 8 గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద లాటరీ తీస్తారని చెప్పారు. అయితే దరఖాస్తు చేసుకున్న వ్యక్తి ఆధార్, ప్రతినిధి ఆధార్, డిక్లరేషన్ ఫామ్, ఎంట్రీ పాస్‌తో సహా తీసుకురావాలని సూచించారు.

అంతన్నారు.. ఇంతన్నారు..

- ధరలు దించుతామని బీరాలు పలికిన కూటమి నేతలు
- కొన్ని రైతుబజార్లలో బియ్యం, కందిపప్పు నిల్
- నాణ్యత లోపించడంతో కొనేందుకు ప్రజల విముఖత



కొత్తపేట రైతుబజార్‌లో బియ్యం, కందిపప్పు లేని ప్రత్యేక కేంద్రం

కొత్తపేట: ప్రజలకు తక్కువ ధరకే నాణ్యమైన కందిపప్పు, బియ్యం అందజేస్తామని ఊదరగొట్టిన కూటమి ప్రభుత్వం రోజుల వ్యవధిలోనే చేతులెత్తేసింది. ఓ వైపు కూరగాయల ధరలు కొండెక్కి కూర్చున్నాయి. కందిపప్పు ధర డబుల్ సెంచరీ దాటింది. ఈ తరుణంలో ధరలు దించుతామంటూ బీరాలు పలికిన ప్రభుత్వ పెద్దలు రైతుబజార్లలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. కొన్ని చోట్ల కౌంటర్లు ప్రారంభించారు. దాంతో ఆశపడిన వాటిని కొలుగోలు చేసిన పేద, మధ్యతరగతి వినియోగదారులు వాటి నాణ్యత, ధరలు చూసి పెదవి విరుస్తున్నారు. ఇంతటి సంబరానికి అంతటి డప్పెందుకని బహిరంగంగానే విమర్శిస్తున్నారు.

మాటలకే పరిమితమైన నాణ్యత

మండల కేంద్రాలు, పట్టణ ప్రాంతాల్లో కందిపప్పు, బియ్యం అందించే ప్రత్యేక కేంద్రాలను ఈ ఏడాది జూలైలో స్థానిక ఎమ్మెల్యేలు, అధికారులు అట్టహాసంగా ప్రారంభించి ఉపన్యాసాలు దంచారు. కొన్ని కేంద్రాల్లో ఆ సరకుల విక్రయాలు మూణ్నాళ్ల ముచ్చటే. ఆ కేంద్రాలతో ప్రజలకు ఒనగూరిందేమీ లేదన్న అభిప్రాయం వినిపిస్తోంది. ప్రభుత్వం ప్రకటించిన ధరకు కందిపప్పు, బియ్యం ప్రజలకు అందుతున్నాయా లేదా అనే విషయాన్ని పట్టించుకున్న దాఖలాలు లేవు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ధరలు, బయట మార్కెట్లో ధరలకు పెద్ద వ్యత్యాసం లేకపోవడం గమనార్హం. కందిపప్పు కేజీ రూ.160, బియ్యం కేజీ రూ.48, స్టీం బియ్యం రూ.49 చొప్పున ప్రత్యేక కేంద్రాల్లో అందిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. అయితే బయట మార్కెట్లో కందిపప్పు రకాలను బట్టి రూ.180 నుంచి రూ.225కు లభిస్తున్నాయి. అదే విధంగా బియ్యం కూడా రకాలను బట్టి రూ.50 నుంచి లభ్యమవుతున్నాయి. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లో కందిపప్పు, బియ్యం నాణ్యత లేకపోవడంతో పాటు ధరలో వ్యత్యాసం నామమాత్రంగా ఉండటంతో ప్రజలు ఆ సరకులపై ఆసక్తి చూపడం లేదు. నియోజకవర్గ కేంద్రంలోని కొత్తపేట రైతుబజార్ కేంద్రం ప్రారంభించిన కొన్ని రోజులు మాత్రం బియ్యం, కందిపప్పు విక్రయించారు. ఆ తరువాత నుంచి అప్పుడప్పుడు అరకొరగా విక్రయించారని, గత కొన్ని రోజులుగా బియ్యం, కందిపప్పు కోసం వెళితే సరకు రాలేదని చెబుతున్నారంటూ పలువురు వాపోయారు. దీనిపై కొత్తపేట రైతు బజార్ ఎస్టేట్ ఆఫీసర్ స్వర్ణలతను వివరణ కోరగా మొదట్లో బియ్యం, కందిపప్పు విక్రయాలు బాగున్నాయని, తరువాత మాల్స్‌కు కూడా ఈ సరకు సరఫరా చేయడం, బయట మార్కెట్‌లో కూడా రేట్లు తగ్గడంతో క్రమేపీ విక్రయాలు తగ్గడం వలన సరకు పెట్టడం లేదన్నారు.

ప్రచార ఆర్భాటమే..



రైతుబజార్‌లో తక్కువ ధరలకు బియ్యం, కందిపప్పు విక్రయిస్తున్నామంటూ పాలకులు ఆర్భాటంగా ప్రచారం చేశారు. కానీ అది కొన్ని రోజులే ఇచ్చారు. అదీ నాణ్యత లేనివి విక్రయించారు. బయట మార్కెట్‌లో మరో రూ.5, 6 వెచ్చిస్తే నాణ్యమైన సరకు లభిస్తుంది. రేషన్ షాపుల్లో కందిపప్పు ఇస్తున్నామంటున్నారు. కానీ ఇవ్వట్లేదు. ఒక చౌకడిపో పరిధిలో వెయ్యి కార్డులు ఉంటే వంద, రెండొందల కార్డులకు మాత్రమే వస్తున్నాయని డీలర్లు చెబుతున్నారు.

– సుతాపల్లి నానారావు, వినియోగదారుడు, కొత్తపేట

జాతీయ హ్యాండ్‌బాల్ జట్టులో ప్రణీత్‌వర్మకు స్థానం



హ్యాండ్‌బాల్ జట్టు సభ్యులు



ప్రణీత్ వర్మ

ఆత్రేయపురం: జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ జట్టులో ఆత్రేయపురం గ్రామానికి చెందిన ముదునూరి ప్రణీత్‌వర్మకు స్థానం లభించింది. సీబీఎస్ఈ సౌత్ జోన్ (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, పాండిచ్చేరి, అండమాన్ నికోబార్) రాష్ట్రాలు పాల్గొన్న హ్యాండ్‌బాల్ పోటీల్లో అండర్–19 విభాగంలో అనకాపల్లి జిల్లా పాయకరావుపేట శ్రీప్రకాష్ విద్యానికేతన్ తరఫున ముదునూరి ప్రణీత్ వర్మతో కలసి ఆడిన జట్టుకు ప్రథమస్థానం లభించింది. హైదరాబాద్‌లో దిక్రాక్ ప్లానెట్ స్కూల్‌లో మియాపూర్‌లో రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలను గత నెల 27 నుంచి అక్టోబర్ 2 వరకు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రథమ స్థానం పొందిన హ్యాండ్‌బాల్ జట్టు జాతీయస్థాయిలో ఈనెల 7 నుంచి 10 వరకు నాలుగు రోజుల పాటు ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్ జిల్లా మోడీనగర్‌లో జరిగే జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొంటారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట ప్రకాష్ విద్యానికేతన్‌లో ఇంటర్ చదువుతూ హ్యాండ్‌బాల్ జాతీయ జట్టులో స్థానం పొందిన ఆత్రేయపురం గ్రామానికి చెందిన ముదునూరి ప్రణీత్ వర్మను గ్రామస్తులు అభినందించారు.

గ్రామస్తుల ఆర్థిక సాయం



రామరాజులంకలో సాయం అందిస్తున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

మలికిపురం: మండలంలోని రామరాజులంక గ్రామానికి చెందిన పోతుల పుల్లారావు (శ్రీను) అనారోగ్యంతో బాధపడుతున్నారు. అతని కుటుంబ ఆర్థిక పరిస్థితి దయనీయంగా ఉండటంతో వైద్య ఖర్చుల నిమిత్తం రామరాజులంక గ్రామస్తులందరూ కలసి సేకరించిన రూ.61000 ఆర్థిక సాయాన్ని ఆదివారం అందించారు. రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ చేతుల మీదుగా బాధితుడికి అందజేశారు. దాతల ఔదార్యాన్ని ఎమ్మెల్యే అభినందించారు. మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెదకాపు, ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యవాణి, మాజీ సొసైటీ అధ్యక్షుడు బొరుసు ఉమా మహేశ్వరరావు, మేడిచర్ల పెద్దబ్బులు, మల్లిపూడి సత్తిబాబు, గెద్దం మహాలక్ష్మీ ప్రసాద్, ముద్దల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎం కుటుంబానికి పరామర్శ

సఖినేటిపల్లి: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కేశవదాసుపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సుజాత కుటుంబ సభ్యులను ఆదివారం రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పరామర్శించారు. ఈ మేరకు ఉయ్యూరువారి మెరకలో సుజాత కుటుంబ సభ్యులను ఆయన ఓదార్చి, తీవ్ర సానుభూతి తెలిపారు. ఎంపీపీ మేడిచర్ల సత్యవాణి, ఏపీ మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ జి.పెదకాపు, ఎంఈవో–1డి.కిషోర్ కుమార్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



అప్పనపల్లిలో సందడి చేసిన పూర్వ విద్యార్థులు

మామిడికుదురు: పదకొండేళ్ల క్రితం కలసి చదువుకున్న పూర్వ విద్యార్థులను దసరా పండగ ఒక చోట చేర్చింది. అప్పనపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 1998–2003 పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం అప్పనపల్లి పాఠశాల ప్రాంగణంలో ఆద్యంతం కనులపండువలా జరిగింది. ఉద్యోగాల రీత్యా, కుటుంబ పరంగా పలు ప్రాంతాలు, పట్టణాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు దసరా సెలవుల సందర్భంగా ఒక చోట చేరి సందడి చేశారు. నాటి మధుర స్మృతులను, చిలిపి జ్ఞాపకాలను మననం చేసుకుని మురిసిపోయారు. తమకు విద్య నేర్పి ప్రయోజకులను ప్రధానోపాధ్యాయుడు బావరాజు సూర్యప్రకాశరావు, ఉపాధ్యాయులు మేడిచర్ల శ్రీనివాస్, యర్రాప్రగడ రమాదేవి, నారాయణశర్మ, ఓకేఎస్ శర్మ, పాటి విశ్వనాథంలను ఘనంగా సత్కరించి, వారికి జ్ఞాపికలు అందించారు. ఆటలు ఆడి, పాటలు పాడి సందడి చేశారు. అంతా కలిసి విందు భోజనాలు ఆరగించారు. తమతో కలసి చదువుకుని ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్న ముగ్గురు సహచర మిత్రులకు ఒక్కొక్కరికి కుటుంబానికి రూ.40 వేల వంతున రూ.1.20 లక్షల ఆర్థికసాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి పెద్దపీట



వాడపాలెంలో రోడ్డు నిర్మాణ శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

కొత్తపేట: నియోజకవర్గంలో అభివృద్ధికే పెద్దపీట వేస్తామని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. మండలంలోని వాడపాలెంలో జరిగిన పలు సిమెంట్ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ గత అయిదేళ్లు నియోజకవర్గంలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలుపొందడం, టీడీపీ కూటమి అధికారంలోకి రావడం నియోజకవర్గ అభివృద్ధికి కలిసొచ్చే అంశమన్నారు. ఇక నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని సత్యానందరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ త్సామాబాబు, మాజీ సర్పంచ్ బండారు బులితాత తదితరులు పాల్గొన్నారు.

విఘ్నేశ్వరుని సన్నిధిలో అధికారులు



విఘ్నేశ్వరుని సన్నిధిలో జిల్లా రెవెన్యూ అధికారి

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామిని జిల్లా రెవెన్యూ అధికారి మొగలి వెంకటేశ్వరరావు సతీ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. ఆయనకు అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆయన స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే రాజమహేంద్రవరం ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ రీజినల్ జాయింట్ కమిషనర్ ఈ.ప్రసాద్ కూడా తన కుటుంబ సభ్యులతో స్వామిని దర్శించుకున్నారు. అర్చకులు స్వామివారి ఆలయ చరిత్రను వివరించారు.

కొత్తపేట విద్యుత్ శాఖ ఏఈగా శ్రీనివాస్



నూతన ఏఈఈ శ్రీనివాస్‌ను అభినందిస్తున్న సిబ్బంది

కొత్తపేట: విద్యుత్ శాఖ స్థానిక అసిస్టెంట్ ఇంజినీర్ (ఏఈ)గా వి.శ్రీనివాస్ బాధ్యతలు చేపట్టారు. ఇంతవరకూ ఇక్కడ ఏఈగా పనిచేసిన పి.నరేష్ రావులపాలెం బదిలీ కాగా ఆయన స్థానంలో అయినవిల్లి ఏఈగా పనిచేసిన శ్రీనివాస్ ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఆయనకు ఏఈ నరేష్ బాధ్యతలు అప్పగించారు. ఆయనతో పాటు ఎల్ఎంలు, ఇతర సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతించారు.

డీఈఈగా చిట్టిరాజు



చిట్టిరాజు

కొత్తపేట: స్థానిక ఎలక్ట్రికల్ సబ్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా డి.చిట్టిరాజు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకూ ఇక్కడ డీఈఈగా పని చేసిన డి.శ్రీనివాసరావు రాజమహేంద్రవరం టౌన్ 1 డీఈగా బదిలీ అయ్యారు. కోరుకొండ డీఈగా పనిచేసిన చిట్టిరాజు కొత్తపేటకు బదిలీపై వచ్చారు. బాధ్యతలు చేపట్టి స్థానిక సబ్ డివిజన్ పరిధిలో ఏఈఈలు, సబ్ ఇంజినీర్‌లు, ఎల్ఎంలు, సిబ్బందితో సమీక్షించారు. నాణ్యమైన విద్యుత్ సరఫరాకు సమష్టిగా కృషి చేద్దామని, అందుకు అందరూ సహకరించాలని కోరారు.

లక్ష్మీనృసింహుని సన్నిధికి పోటెత్తిన భక్తులు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని సన్నిధికి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు పోటెత్తారు. అలాగే స్థానిక అశ్వరూఢాంబిక ఆలయంలో కూడా అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. కాగా దశరా పర్వదినాలకు తోడు ఆదివారం సెలవు రోజు కావడంతో భక్తుల తాకిడి మరింత పెరిగింది. సాధారణ భక్తులతో పాటు భవానీ భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. అలాగే ఆలయంలో నిర్వహించే నారసింహ సుదర్శన హోమంలో భక్తులు విశేషంగా పాల్గొన్నారు. కాగా సాధారణ, ప్రత్యేక దర్శనాల ద్వారా సుమారు 7,500 మంది స్వామివారిని దర్శించుకున్నట్టు ఆలయ ఏసీ వి.సత్యనారాయణ తెలిపారు. దర్శనం అనంతరం వారికి అన్నదానంలో భోజన వసతిని ఆయన పర్యవేక్షించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా ఆయన ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఆలయంలో క్యూను దేవస్థానం సిబ్బంది పర్యవేక్షించారు.

సారా విక్రేత అరెస్ట్

ఆలమూరు: మండలంలోని బడుగువానిలంకలో నిబంధనలకు విరుద్ధంగా సారా విక్రయిస్తున్న జేసీ సత్యనారాయణను ఆలమూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్థానిక ఎస్సై ఎం.అశోక్ కథనం ప్రకారం గ్రామ శివారు ప్రాంతంలో సారా విక్రయిస్తున్నారనే సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడిలో నిందితుడు సత్యనారాయణ వద్ద నుంచి సుమారు పది లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు ఎస్సై అశోక్ కేసు నమోదు చేసి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖకు అప్పగించారు.

లలితాదేవీ నమోస్తుతే..

- వివిధ అలంకారాల్లో దర్శనమిచ్చిన జగన్మాత
- ఆలయాల్లో అమ్మవారికి పూజలు



అంబాజీపేటలో లలితాదేవి అలంకరణలో వాసవీమాత




కొత్తపేటలో లలితాదేవిగా వాసవీమాత అలంకరణ



పెదపళ్లలో బాలాత్రిపుర సుందరిగా అమ్మ దర్శనం



పెదపట్నంలో శాకంబరిగా దుర్గమ్మకు అలంకారం



ఉచ్చిలిలో లలితాదేవిగా విజయదుర్గమ్మ దర్శనం

అంబాజీపేట: దేవి శరన్నవరాత్రుల్లో భాగంగా మహర్నవమి కావడంతో అంబాజీపేట మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న కనకదుర్గమ్మ ఆలయాల వద్ద ఆదివారం మహిళలు ఘనంగా కుంకుమ పూజలు నిర్వహించారు. స్థానిక పెద్దవీదిలో వీణా శ్యామలాంబ సమేత చంద్రశేఖర స్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. బస్టాండ్ వద్ద ఉన్న వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు లలితా దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. మాచవరం పక్షుల రావిచెట్టు వద్ద శ్రీరాంనగర్‌లోను, అంబాజీపేట పశువుల మార్కెట్ వద్ద ఉన్న విజయకనకదుర్గ అమ్మవారికి ఆలయ ప్రాంగణంలోను కుంకుమ పూజలు నిర్వహించారు.

ఆత్రేయపురంలో..

ఆత్రేయపురం: దేవీ శరన్నవరాత్ర ఉత్సవాలను మండలంలోని ఆలయాల్లో వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆలయాలు, మందిరాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. ఆదివారం అయా గ్రామాల్లో దేవి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉచ్చిలిలో వేంచేసిన విజయదుర్గా దేవి లలితాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే గ్రామంలో వేంచేసిన గాయత్రీ దేవి, శ్రీచక్ర ఆలయంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆధ్యాత్మిక ప్రవచనాలతో సంగీత, నృత్య కార్యక్రమాలతో ఆలయ మందిరాల వద్ద శరన్నవరాత్రుల సందడి నెలకొంది. అలాగే మండలంలోని వసంతవాడ, పేరవరం, రాజవరం, అంకంపాలెం తదితర గ్రామాల్లో శరన్నవరాత్ర ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆయా ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

మామిడికుదురులో..

మామిడికుదురు: కనకదుర్గమ్మ వారి శరన్నవరాత్ర ఉత్సవాలు నాలుగో రోజు ఆదివారం మండలంలోని పలు ఆలయాల్లో వేద మంత్రోచ్చారణలు, భక్తుల కోలాహలం నడుమ అంగరంగ వైభవంగా జరిగాయి. పాశర్లపూడి బాడవలో కొలువుదీరిన కనకదుర్గమ్మ అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ధర్మకర్త తోరం వెంకటరమణారావు ఆధ్వర్యంలో ఈ ఆలయంలో శత చండీయాగం, లక్ష కుంకుమార్చన, లక్ష్మీగణపతి అభిషేకాలు, మల్లేశ్వర స్వామికి ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన పూజలు ఘనంగా జరిపించారు. పెదపట్నంరేవులో సుబ్రహ్మణ్య స్వామి ఆలయం వద్ద దుర్గాదేవిని కూరగాయలతో శాకంబరిగా అలంకరించారు. పెదపట్నంలంకలో కొలువుదీరిన కనకదుర్గమ్మ కూష్మాండ అవతారంలో భక్తులకు శోభాయమానంగా దర్శనమిచ్చారు. మామిడికుదురు విజయదుర్గమ్మను 10,116 గాజులతో అలంకరించారు. పినిశెట్టి సుధాకర్, శిరేఖ దంపతుల ఆధ్వర్యంలో ఈ అలంకరణ జరిగింది. మగటపల్లి గాయత్రి త్రిశక్తి పీఠంలో అమ్మవారు లలితాదేవిగా దర్శనమిచ్చారు.

ఆలమూరులో..

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో జరుగుతున్న శ్రీదేవి నవరాత్ర మహోత్సవాలను పురస్కరించుకుని దుర్గాదేవి అమ్మవారు నాలుగో రోజైన ఆదివారం బాలాత్రిపుర సుందరి దేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆయా ఆలయ మండపాల వద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతిక, ఆధ్యాత్మిక, భజన కార్యక్రమాలు భక్తులను అలరించాయి. విద్యుతీలంకరణతో దేదీప్యమానంగా వెలుగులు సంతరించుకున్న దేవి మండపాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. భవానీ మాలధారులు నిర్వహించిన పడిపూజ భక్తులను అలరించింది.

కొత్తపేటలో..

కొత్తపేట: దసరా మహోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు ఆదివారం మండలంలోని దుర్గాదేవి ఆలయాలు, ఉత్సవ పందిళ్లలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి అమ్మవారిని లలితాదేవిగా అలంకరణ చేశారు. మహిళలతో అమ్మవారి అలంకరణ పూజలు, సహస్ర గాజుల పూజ నిర్వహించారు. ఏనుగులమహల్ రాజరాజేశ్వరిదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. బొరుసువారిసావరం కనకదుర్గాదేవి అమ్మ వారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించి దర్శనం కల్పించారు. వాడపాలెం అయ్యప్పస్వామి, జ్ఞాన సరస్వతీదేవి ఆలయంలో వివిధ పూజలు, హోమాలు నిర్వహించారు. స్థానిక బోడిపాలెం కనకదర్గాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక గ్రామ దేవత బంగారమ్మ అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు.